

ధాన్యం సేకరణకు కంట్రోల్ రూమ్‌లు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో ధాన్యం సేకరణకు మండల స్థాయి కంట్రోల్ రూంలు ఏర్పాటు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. మండల స్థాయి కంట్రోల్ రూంలో తహశీల్దార్, మండల వ్యవసాయ అధికారి, సి.ఎస్.డి.టి లేదా ఆర్ఐ, సబ్ డివిజన్ స్థాయి సహకార అధికారి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఉంటారని ఆయన చెప్పారు. రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు. 2023 - 24 ఖరీఫ్ లో ధాన్యం సేకరణ సజావుగా సాగడానికి మండల స్థాయి కంట్రోల్ రూంలు ఏర్పాటు చేస్తున్నట్లు శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత

గిరిజన వర్సిటీలో శంకుస్థాపన సభలో సిఎం జగన్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, సాలూరు, దత్తిరాజేరు

గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యసేవల కల్పనకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛమైన మనసు, కల్మషం లేని మనుషులు ఎవరైనా ఉన్నారంటే అది గిరిజనులేనని పేర్కొన్నారు. తరతరాలుగా వారిని పేదరికం వెంటాడుతోందని, ఇప్పటికీ కూడా మిగతా ప్రపంచంలో సమం కాని వారి జీవన ప్రమాణాలు, ప్రత్యేకించి వారి జీవితాలను మార్చే విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో పురోగతి సాధించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. మెంటాడ, దత్తిరాజేరు మండలాల సరిహద్దు గ్రామాల పరిధిలో 561.88 ఎకరాల్లో తలపెట్టిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి, ఇతర మౌలిక వసతుల కల్పనకు చినమేడపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, కేంద్ర విద్య, నైపుణ్యాభివద్ధిశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం దత్తిరాజేరు మండలం మరడాం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగసభలో సిఎం మాట్లాడారు. నేడు తలపెట్టిన గిరిజన వర్శిటీ సంకల్పంతో తరతరాలుగా నిర్లక్ష్యానికి గురైన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. విద్య, సాధికారత కోసం, ప్రపంచంతో పోటీ పడే పరిస్థితి రావాలని, ఆ పోటీలో మన రాష్ట్ర విద్యార్థులు గెలవాలని ఆకాంక్షించారు. ఇందుకోసమే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టామన్నారు. 3వ తరగతి నుంచి సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్ అమలు చేస్తున్నామన్నారు. నాడు - నేడు పథకంలో భాగంగా స్కూళ్ల రూపురేఖలు పూర్తిగా మారాయన్నారు. 6వ తరగతి నుంచి ప్రతి క్లాస్ రూమ్‌ను డిజిటలైజ్ చేస్తూ... ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పి)లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మరెక్కడా లేని విధంగా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఉన్నత విద్యలో విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలు, గిరిజన తండాల్లో నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. ఐటిడిఎ పరిధిలో మల్టీ స్పెషాల్టీ హాస్పిటల్ నిర్మాస్తామని ఇచ్చిన మాట ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, పార్వతీపురంలో రూ. 250 కోట్లు ఖర్చు చేస్తూ మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ప్రతి గిరిజన గ్రామంలో వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీల నుంచి సేకరించిన భూములకు, ఇతర పట్టా భూముల కంటే 10 శాతం ఎక్కువ పరిహారం ఇచ్చేందుకు ఇచ్చిన మాట ప్రకారం జీవో 109 జారీ చేశామని తెలిపారు. తొలుత సభలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్వాగత ప్రసంగం చేశారు. కేంద్రీయ విశ్వ విద్యాలయం ద్వారా ఇక్కడ యువతకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 561 ఎకరాల భూమిని యూనివర్శిటీ యాజమాన్యంకు అప్పగించామని గుర్తు చేశారు. 42 నెలల్లో గుర్తించిన ఈ ప్రాంతంలో విశ్వవిద్యాలయ నిర్మాణ పనులు పూర్తవుతాయి అన్నారు. మొదటి దశలో భాగంగా రూ.420 కోట్లతో కొన్ని పనులు ప్రారంభయ్యాయని చెప్పారు. గిరిజన ప్రాంత ప్రజల కళలు, సంస్కృతీ సంప్రదాయాలకు యూనివర్శిటీ చక్కని వేదికగా మారుతుందని పేర్కొన్నారు. విద్య, పరిశోధనలు మరింత పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వం గిరిజన ప్రాంతాలకు దూరంగా నిర్మించాలని ప్రయత్నించిందని, కానీ సిఎం జగన్ ప్రధానితోనూ, కేంద్ర పెద్దలందరితోనూ మాట్లాడి గిరిజన యూనివర్శిటీ గిరిజన ప్రాంతంలోనే ఉండాలని ఒప్పించారని తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేయడం పొరుగు రాష్ట్రాలకు కూడా అనుకూలంగా ఉంటుందన్నారు. యూనివర్శిటీతో గిరిజనులకు మరింత మెరుగైన విద్య అందుతుందని అన్నారు. సిటియు వైస్ ఛాన్సలర్ కట్టమణి మాట్లాడుతూ గిరిజన ప్రాంత విద్యార్థులకు ఇదొక వరమన్నారు. అనంతరం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిలను దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, అరకు ఎంపి గొొట్టేటి మాధవి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె. శ్యామలరావు, ఎమ్మెల్సీలు సురేష్ బాబు, రఘురాజు, ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, కడుబండి శ్రీనివాసరావు, బొత్స అప్పలనరసయ్య, శంబంగి చిన వెంకట అప్పలనాయుడు, పుష్ప శ్రీవాణి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ జివిజి శంకరరావు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



బహిరంగ సభకు హాజరైన జనాలనుద్దేశించి మాట్లాడుతున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి





సిటియు ప్లాన్ గురించి సిఎంకు వివరిస్తున్న విసి కట్టమణి ; సిఎంకు బొబ్బిలి వీణను బహూకరిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

అడియాశే



వేదికపైకి అవకాశమివ్వకపోవడంతో ఎదురుగా కూర్చున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన ప్రజలకు అత్యంత నిరాశ, నిస్పృహలకు గురిచేసింది. ప్రత్యేకించి వైసిపి కార్యకర్తలకు ఏమంతగా రుచించలేదు. పాత విషయాలే చెప్పారని, స్థానిక సమస్యలు చెప్పకునేందుకు ఎమ్మెల్యే మంత్రులకు అవకాశం ఇవ్వలేదని సభకు వచ్చిన ఎక్కువ మంది నోట వినిపించింది. మరోవైపు ఉత్తరాంధ్రలో తిరుగులేని నేతగా, ప్రభుత్వంలో అత్యంత కీలకంగా, విద్యాశాఖ మంత్రిగా ఉన్న బొత్స సత్యనారాయణ మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవడంపై చాలా మంది వైసిపి నాయకులు, క్రియాశీలక కార్యకర్తల్లో నైరాశ్యం కనిపించింది.

- నిరాశపర్చిన సిఎం పర్యటన • వరాలు ఇవ్వని సిఎం
- స్థానిక సమస్యలు చెప్పకునేందుకూ నోఛాన్స్
- సభలో గిరిజనులను భాగస్వామ్యం చేయలేని వైనం
- వైసిపి శ్రేణులకూ రుచించని సిఎం ప్రసంగం
- డిప్యూటీ సిఎం రాజన్నదొర స్పీచ్‌కు తలశిల అడ్డుకట్ట
- మంత్రి బొత్సకు నో మైక్
- స్థానిక ఎమ్మెల్యే అప్పలనర్సయ్యకూ వేదికపై దక్కనిచోటు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కేంద్రీయ గిరిజన యూనివర్శిటీ శంకుస్థాపన సందర్భంగా దత్తిరాజేరు మండలం మరడాం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. రెండు జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ రంగాలకు చెందిన ఛైర్మన్లు హాజరైనప్పటికీ, కనీసం ఎమ్మెల్యే ఎమ్మెల్సీలకు కూడా వేదికపై అవకాశం కల్పించలేదు. స్థానిక ఎమ్మెల్యే అప్పల నర్సయ్యను కూడా వేదికపైకి ఆహ్వానించకపోవడంతో తమ సమస్యలు విన్నవించుకునేందుకు అవకాశం లేకపోయిందంటూ గజపతి నగరం నియోజకవర్గం నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో వైసిపిలో పవర్ ఫుల్ లీడర్‌గా వున్న మంత్రి బొత్సకు కూడా మాట్లాడేందుకు అవకాశం కల్పించక పోవడం పట్ల చాలా మంది నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. విద్యాశాఖ మంత్రి హోదాలోనైనా ఆయనకు అవకాశం కల్పించాల్సి వుందని, సిఎం ఉద్దేశపూర్వకంగానే అవకాశం ఇవ్వలేదని కొంతమంది నోట వినిపించింది. జిల్లా, స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలకు మాట్లాడడానికి అవకాశం ఇవ్వకపోయినా, సాలూరు, గజపతి నగరం నియోజకవర్గాలకు అవసరమైన అభివృద్ధి పనులు లేదా సమస్యల పరిష్కారం విషయమైనా సిఎం మాట్లాడలేదు. వాస్తవానికి గుర్ల గెడ్డ జలాశయం 25ఏళ్లగా పెండింగ్‌లో ఉంది. కేవలం రూ.16కోట్లు ఖర్చుచేస్తే సుమారు 3వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. తోటపల్లి నుంచి వచ్చే గజపతినగరం బ్రాంచి కెనాల్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దత్తిరాజేరు మండలంలో చాలా వరకు సాగునీటి అవకాశం లేక ఎక్కువగా కరువు కాటకాలతో అల్లాడుతోంది. అందుకే ఇక్కడి నుంచి వలసలు కూడా ఎక్కువగా ఉన్నాయి. మానాపురం రైల్వే వంతెన పనులు రెండు దశాబ్దకాలంగా నిలిచిపోయాయి. ముఖ్యంగా కొఠియా గ్రామాల ప్రజలకు మన రాష్ట్రం తరపున పెద్దగా అభివృద్ధి కార్యక్రమాలు చేయడం లేదనే ప్రచారం ఒడిశా ప్రభుత్వం చేస్తోంది. సాలూరు పట్టణంలో రహదారుల విస్తరణ పనులు ముందుకు సాగడం లేదు. ఇవన్నీ చిన్నచిన్న సమస్యలే అయినా స్థానికులకు పెద్ద ఆటకంగాను, అవరోధంగాను ఉన్నాయి. వీటి గురించి చెప్పుకునేందుకు ఎలాగూ అవకాశం కల్పించలేదు సరికదా కనీసం ముందస్తుగా తెలుసుకుని, వాటిపై హామీలైనా ఇవ్వలేదని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక నాయకులను విస్మరించి, సమస్యలను ప్రస్తావించకుండా పాలన సాగిస్తే వచ్చే ఎన్నికల్లో కష్టమేనని కూడా రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. గిరిజనుల ఉద్దరణకు ఏర్పాటు చేస్తున్నామంటున్న గిరిజన యూనివర్శిటీ శంకుస్థాపన సభలో గిరిజనులను భాగస్వామ్యం చేయలేక పోయారు. ఇందుకు సభ విజయనగరం జిల్లాలో జరపడం ఒక కారణమైతే, పార్వతీపురం మన్యం జిల్లా అధికార యంత్రాంగాన్ని నామమాత్రంగానే భాగస్వామ్యం చేయకపోవడం రెండో కారణంగా చెప్పుకోవచ్చు. చివరకు గిరిజన శాఖ మంత్రి రాజన్నదొరను సభాధ్యక్షుడిగా ప్రకటిస్తూనే ఆ స్థానానికి దూరం చేస్తూ స్థానికేతర వ్యాఖ్యాత అన్నీ తానై వ్యవహరించారు. రాజకీయ ప్రత్యర్థులపై స్పందించకపోవడం పట్ల కూడా వైసిపి కేడర్‌లో చర్చనడిచింది. రాజన్నదొర మాట్లాడుతుండగా సిఎం సభ ఏర్పాట్ల సమన్వయకర్త తలశిల రఘురాం ప్రసంగం ముగించాలంటూ ఆదేశాలివ్వడంతో సభికులు నివ్వెరబోయారు.

ఇక్కడ దోస్తీ...అక్కడ కుస్తీ



రాజన్నదొర, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నవ్వులాట

ప్రజాశక్తి - సాలూరు

కొటియా గ్రామాల నుంచి ఆంధ్రా గోబ్యాక్ అని గర్జించిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో శుక్రవారం డిప్యూటీ సిఎం రాజన్నదొర నవ్వులాట ఆడారు. గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకు వచ్చిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజన్నదొర భుజం తడుతూ హాస్యమాడిన దృశ్యం కనిపించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో కొటియా గ్రామం పట్టు చెన్నూరులో పర్యటించిన కేంద్ర మంత్రికి అక్కడ ఎదురైన ఎపి పోలీసులనుద్దేశించి ఆంధ్రా గోబ్యాక్ అన్నారు. కొటియాలో మీకేం పని ఆయన నిలదీశారు. ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధమని, సుప్రీంకోర్టు తీర్పు ఉల్లంఘన కిందకు వస్తుందని రాజన్నదొర వ్యాఖ్యానించారు. అలాంటి పరిస్థితుల్లో శుక్రవారం ఒకే వేదిక మీద కలుసుకుని కరచాలనం చేసుకున్న కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రి ఇద్దరూ నవ్వులాట ఆడుకున్నారు. అయితే కొటియా గ్రామాలకు విధి నిర్వహణలో భాగంగా వెళ్తున్న వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులకు దినదిన గండంగా మారుతోంది. ఎపి ఉద్యోగులు కొటియా గ్రామాల్లో అడుగు పెట్టిన ప్రతిసారీ ఒడిశా అధికారులు, పోలీసులు అడ్డుకుంటున్నారు. శుక్రవారం ఫ్యామిలీ కాన్సెప్ట్ లో భాగంగా తోణాం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అక్కేన అజయ్ తన సిబ్బందితో కలిసి కొటియా గ్రామం పణికి వెళ్తుండగా కొటియా పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసు స్టేషన్ ముందు రెండు గంటల పాటు నిలబెట్టించారు. కొటియా గ్రామాల వివాదానికి పరిష్కారం చూపకుండా ఎపి, ఒడిశా ప్రభుత్వాలు చోద్యం చూస్తున్న నేపథ్యంలో ఆంధ్ర ఉద్యోగులను అడ్డుకోవడం, వాగ్వాదానికి దిగడం పెద్ద తలనొప్పిగా మారింది. ఉద్యోగులు కూడా విధి నిర్వహణలో భాగంగా కొటియా గ్రామాల్లో పర్యటించడానికి భయభ్రాంతులకు గురవుతున్నారు.

అవగాహనా రాజకీయాలతో కొలిక్కిరాని కొటియా సమస్య
అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్న అధికారులు



కొటియా చెక్‌పోస్టు వద్ద ఆంధ్రా వైద్యాధికారులను అడ్డుకున్న ఒడిశా పోలీసులు

ప్రజా సమస్యలపై 30నుంచి సమరభేరి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - బెలగాం

కేంద్రంలో మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని గద్దిదించేందుకే దేశంలో సిపిఎం సమరభేరి యాత్రను చేపడుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ చెప్పారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సిపిఎం కేంద్ర కమిటీ పిలుపుమేరకు ప్రజల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 30 నుండి సెప్టెంబర్ 4 వరకు సమరభేరి యాత్రను చేపడుతున్నామన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చేముందు ఒక మాట, వచ్చాక రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలు శరవేగంగా అమలు చేయడంలో ముందు ఉందన్నారు. దీంతో పాటు మతోన్మాదాన్ని ప్రజల్లో ప్రేరేపిస్తూ విభజించు పాలించే ధోరణిలో ప్రజలకు తీవ్ర నష్టం చేస్తుందని విమర్శించారు. మణిపూర్‌లో ఉన్న డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల స్త్రీలకు సంరక్షణ లేదని, వారిని వివస్త్రాలు చేసి ఊరేగింపు సంఘటన ప్రపంచమే తలదించుకునే పరిస్థితులు బిజెపి వల్ల వచ్చాయని అన్నారు. అందుకే స్త్రీలకు రక్షణ కల్పించే చట్టాలను తీసుకురావాలని, మణిపూర్ సిఎం వీరేంద్రసింగ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇక నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. ప్రపంచంలో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుముఖం పట్టినా దేశం, రాష్ట్రంలో మాత్రం డీజిల్, పెట్రోల్ ధరలు ఇష్టానుసారంగా పెంచుకుపోతున్నారన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్నారని, తీరా కోటి ఉద్యోగాలు కాదు కాదా కోటి యాభై లక్షల ఉద్యోగాలు ఊడిపోయాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేటుపరం చేసి నిరుద్యోగాన్ని, మతోన్మాదాన్ని బిజెపి పెంచి పోషిస్తుండడం భవిష్యత్తులో ప్రజల ఆగ్రహాన్ని చవిచూస్తారన్నారు. వ్యవసాయ కార్మికులకు పని భద్రత కల్పించాలని యుపిఎ హయాంలో సిపిఎం ఒత్తిడి మేరకు ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొస్తే ఇప్పుడు బిజెపి ఆ చట్టానికి తూట్లు పొడుస్తుందని విమర్శించారు. జిల్లాలో జూట్, సుగర్ ఫ్యాక్టరీ మూతపడ్డాయన్నారు. విద్యుత్ సంస్కరణలు వచ్చిన తర్వాత ప్రజలపై భారాలు పెరగడమే కాకుండా ఫ్యాక్టరీలు కూడా మూతపడి ప్రజలకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. ఉత్తరాంధ్రాకు ఆశాజ్యోతిగా ఉన్న స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయొద్దని 900 రోజుల నుండి కార్మికులు పోరాడుతుంటే రాష్ట్రంలో వైసిపి, ప్రతిపక్షమైన టిడిపి, జనసేన ఏ ఒక్కరూ దీన్ని వ్యతిరేకించడంలేదన్నారు. పట్టణాల్లో సంస్కరణలు తీసుకొచ్చి చెత్త పన్ను, ఆర్థిక పన్నులు, భారాలు పెట్టి పట్టణ వాసులను ఇబ్బంది పెడుతున్నారని అందుకు ఈ డిమాండ్లన్నీ పరిష్కారం కావాలని సమరభేరి యాత్ర జరుగుతుందని, ఇందుకు ప్రజలంతా మద్దతు ఇవ్వాలని కోరారు. విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొల్లి గంగు నాయుడు, ఎం.తిరుపతిరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్నసిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు సుబ్బరావమ్మ



ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డను దాటుతున్న గ్రామస్తులు

ఉధృతంగా ప్రవహిస్తున్న రాళ్లగెడ్డ

ప్రజాశక్తి - కురుపాం

ఏజెన్సీలో గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు జియ్యమ్మవలస మండలం గడసింగిపురం వద్ద గల రాళ్లగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో సుమారు 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. వరి పంట నీట మునగడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గత రెండు రోజులుగా గెడ్డ నడుము లోతు వరకు ప్రవహిస్తోందని, దాంతో వాహనాలు నిలిచిపోయి ఉద్యోగులు, వాహనదారులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ కనీసం 108 వాహనం కూడ రాకపోవడంతో అత్యవసర పరిస్థితిల్లో రోగులకు మోసుకెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నా ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రాళ్ల గెడ్డ వద్ద వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

రైతులకు మేలు జరిగేలా సలహాలు అందించాలి

ప్రతిరైతూ ఇ-కెవైసి చేయించుకోవాలి
వ్యవసాయ సలహామండలి జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు

ప్రజాశక్తి - పార్వతీపురం

వ్యవసాయ సలహా మండలిలో రైతులకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకొని ప్రభుత్వానికి నివేదించాలని జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు వాకాడ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించి ప్రభుత్వ పథకాలు, ప్రకృతి వైపరీత్యాల్లో నష్టపరిహారం పొందేందుకు, పంటను అమ్ముకొనేందుకు ప్రతిరైతు తప్పని సరిగా ఇ-పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. రైతుభరోసా కేంద్రాల స్థాయి, మండల స్థాయి సలహా మండలి సమావేశాలకు సంబంధిత శాఖల అదికారులు హాజరుకావాలన్నారు. జెసి గోవిందరావు మాట్లాడుతూ ఈ ఏడాది ధాన్యం కొనుగోలుకు లక్ష్యం లేదని, రైతు పండించే ప్రతి గింజ కొనుగోలు చేస్తామని, రైతులు తమ పంటను అమ్ముకొనేందుకు తప్పని సరిగా ఇ-పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశాలకు సభ్యులుగా జిల్లా స్థాయి అధికారులంతా తప్పని సరిగా హాజరుకావాలని అన్నారు. నెలలో మొదటి శుక్రవారంలో ఆర్‌బికెల కేంద్రాల స్థాయిలోనూ, రెండో శుక్రవారం మండల స్థాయిలో జరిగే సలహా మండలి సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను, తీర్మానాలను తప్పని సరిగా పంపించాలని, వాటిని జిల్లా స్థాయిలో అమలు చేయగలిగినవి చేసి, మిగిలిన వాటిని పరిష్కారం నిమిత్తం ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. నీటి పారుదల శాఖ పంటలకు సకాలంలో నీరు విడుదలకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, ప్రోజెక్టుల నుండి నీటి విడుదల సమాచారాన్ని జిల్లావ్యవసాయ సలహామండలి ఛైర్మన్, సభ్యులకు ముందస్తుగా అందించాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్ వ్యవసాయ, అనుబంధశాఖల నివేదిక సమర్పిస్తూ జిల్లాలో గుమ్మలక్ష్మీపురం మండలం మినహా మిగిలిన మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైందన్నారు. జిల్లాలో లక్షా 77 ఎకరాల వరి సాగు లక్ష్యంగా 25వేల క్వింటాలు విత్తనాలు పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతానికి లక్షా 13వేల ఎకరాల్లో నాట్లు పూర్తయినాయని, ఈ నెలాఖరుకు లక్ష్యం మేరకు వరినాట్లు పూర్తవుతాయని తెలిపారు. జిల్లాకు 45వేల మెట్రిక్ టన్నులు ఎరువులు కేటాయించగా 34 మెట్రక్ టన్నులు జిల్లాకు వచ్చాయని, 24 వేల మెట్రిక్ టన్నులు పంపిణీ జరిగిందని, 9వేల టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయని, ఎరువులు పొందని రైతులు వెంటనే వారి ఆర్‌బికెల ద్వారా పొందాలని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ నాగేశ్వరరావు

మండలాల్లో జరిగిన సలహామండలి సమావేశాల్లో వ్యక్తిగత పనిముట్లు సరఫరా చేయాలని, ధాన్యం సేకరణలో దగ్గర మిల్లులకు జియోట్యాగింగ్ చేయాలని, ఆర్‌బికె భవనాల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని, వ్యవసాయ యాంత్రీకరణకు వ్యక్తిగతంగా పరికరాలు సరఫరా చేయాలని, సూక్ష్మపోషకాలు, టార్పాలిన్లు, బిందుసేద్య పరికరాలు, గడ్డి విత్తనాలు సరఫరా చేయాలనికోరుతూ తీర్మానాలు చేసి పంపించారని, తీర్మానాలకు అనుగుణంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం ప్రోత్సాహాన్నిస్తున్నదని, పంట నమోదులో ప్రకృతి పంటను విడిగా నమోదు చేస్తున్నారని తెలిపారు. గ్రామ స్థాయి సమావేశాలకు సభ్యులంతా హాజరుకావాలని, చెరువుల్లో ఆక్రమణలు తొలగించి ఆయకట్టు భూములకు నీరందించాలని, ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత కల్పించాలని, ఐటిడిఎ పరిధిలో పండించే పంటలను అమ్ముకొనేందుకు విశాఖపట్నం రైతుబజార్లలో స్టాల్‌ను కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని సభ్యులను కోరారు. సమావేశంలో సభ్యులు పారినాయుడు, ఎస్.జనార్థనరావు, నరశింహామూర్తి, డిసిఓ సన్యాసినాయుడు, జిల్లా ఉద్యానఅధికారి సత్యనారాయణరెడ్డి, జిల్లా మత్స్యశాఖఅధికారి తిరుపతయ్య, ఇతర శాఖల అదికారులు పాల్గొన్నారు.

గిరిజనుల్లేని సభలో గిరిజన సంక్షేమంపై సిఎం ప్రసంగం

ఆహ్వానం లేని మన్యం జిల్లా అధికారులు

ప్రజాశక్తి - సాలూరు

కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపన అనంతరం దత్తిరాజేరు మండలం మరడాం సమీపంలో నిర్వహించిన సభలో సిఎం జగన్ మోహన్ రెడ్డి చేసిన ప్రసంగం మొత్తం గిరిజనుల గురించే సాగింది. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఆయన మాట్లాడారు. అయితే ఆ సభలో హాజరైన మొత్తం కార్యకర్తలు, నాయకుల్లో ఎక్కువ మంది గిరిజనేతరులే కనిపించారు. సభకు సుమారు 20వేల మంది వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై వుంటారని అంచనా వేస్తున్నారు. వీరిలో కనీసం పది శాతం మంది కూడా గిరిజనులు కనిపించలేదు. సాలూరు గిరిజన నియోజకవర్గం కావడంతో హాజరైన వారంతా గిరిజనులే అనుకున్న సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రసంగం ఆద్యంతం గిరిజన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు.

పత్తా లేని మన్యం జిల్లా అధికారులు

గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపన అనంతరం జరిగిన సభలో విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడారు. గత నాలుగు రోజులుగా సిఎం జగన్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు, ఇతర కార్యక్రమాలన్నీ ఈ జిల్లా అధికారుల కనుసన్నల్లోనే జరిగాయి. విజయనగరం జిల్లాకు చెందిన వైసిపి అగ్రనేతల హడావుడే అక్కడ కనిపించింది. పార్వతీమన్యం జిల్లా కలెక్టర్ గానీ, ఇతర జిల్లా అధికారులు గానీ సభ, శంఖుస్థాపన ఏర్పాట్లలో కనిపించలేదు. కానీ సాలూరు నియోజకవర్గం మన్యం జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు అంటూ ప్రచారాన్ని తెరపైకి తెచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లా గిరిజనులను మభ్యపెట్టే ప్రయత్నంలో భాగంగానే అధికారపార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రజాశక్తి
www.prajasakti.com



మంత్రి బొత్స ఇంట్లో వరలక్ష్మి వ్రతానికి హాజరైన గిరిజన మహిళా ప్రజాప్రతినిధులు

బొత్స నివాసంలో వరలక్ష్మి పూజలు

హాజరైన వైసిపి గిరిజన ఎమ్మెల్యే లు

ప్రజాశక్తి - విజయనగరం

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నివాసంలో నిర్వహించిన శ్రావణ శుక్రవారం పూజల్లో వైసిపి గిరిజన ఎంపి, ఎమ్మెల్యేలు, జిసిసి చైర్ పర్సన్ పాల్గొన్నారు. శుక్రవారం గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపన, సభ అనంతరం అరుకు ఎంపి జి.మాధవి, ఎమ్మెల్యేలు వి.కళావతి, భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర, జిసిసి చైర్ పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి పూజల్లో పాల్గొన్నారు. మాజీ ఎంపి బొత్స ఝాన్సీ నిర్వహించిన పూజల్లో వైసిపి ఎమ్మెల్యేలు, ఎంపిలు పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు.



సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రామయ్య

తెలుగు భాష గొప్పతనాన్ని గుర్తించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాష దినోత్సవ వారోత్సవాలను ఈనెల 23 నుంచి 29 వరకు నిర్వహిస్తున్నట్లు వైస్ ప్రిన్సిపల్ డి.రామయ్య తెలిపారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి తెలుగు భాష అభివృద్ధికి, భాషా, సాంస్కృతికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. దేశభాషలందు తెలుగు లెస్స అనేంతగా తెలుగు భాష గొప్పతనాన్ని చాటి చెప్పారని అన్నారు. విద్యార్థులచే వేమన పద్యాలపన చేయించారు. కంఠస్థ ఉపాధ్యాయుల పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.త్రినాధ, శ్రీలక్ష్మి, శ్రీవాణి పాల్గొన్నారు.

సాలూరు ప్రాంతంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుచేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

సాలూరు గిరిజన ప్రాంతంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు డిమాండ్ చేసారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం ప్రభుత్వం, ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం విజయనగరం జిల్లా మైదాన ప్రాంతాల్లో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం సరైంది కాదన్నారు. గిరిజన యూనివర్సిటీ గిరిజన ప్రాంతాల్లో ఉంటే గిరిజన బతుకులపై ,జీవన విధానాలపైనా, సంక్షేమం, అభివృద్ధి, సంస్కృతి, సాంప్రదాయ, కళలు, ఆచార, వ్యవహారాలపై పరిశోధనలు చేయటానికి అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. దీన్ని ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.

విఆర్ఎలపై నిర్బంధం ఆపాలి

ప్రజాశక్తి - బెలగాం

గ్రామ రెవెన్యూ సహాయకులపై ప్రభుత్వ నిర్బంధం ఆపాలని, వారి సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సిఐటియు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి విఆర్ఎల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లయినా ఇప్పటికీ వారి సమస్యలు పరిష్కరించకపోగా, శాంతియుతంగా సమస్య చెప్పుకుందామని చలో విజయవాడకు బయలుదేరిన విఆర్ఎలపై నిర్బంధాన్ని ప్రయోగించి అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. వెంటనే ప్రభుత్వం అరెస్టు చేసిన విఆర్ఎలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేస్కేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, నామినీలను విఆర్ఎలుగా గుర్తించాలని, అర్హత ఉన్న విఆర్ఎలను అటెండర్, వాచ్మెన్, కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళ్లు అర్పిస్తున్న అక్కివరపు

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- సీతానగరం

స్థానిక దళిత వాడలో శుక్రవారం పుచ్చల రామారావు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు పుచ్చల నాగేశ్వరరావు అలియాస్ పండు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విజిలెన్స్‌కమిషనర్ డాక్టర్ ఎస్ రాజు వెంకట్రావు, దళిత సామాజిక జాతీయ అధికార ప్రతినిధి అక్కివరపు మోహనరావు మాట్లాడుతూ ప్రపంచంలోనే ప్రఖ్యాతగాయించి భారతదేశ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా కొనియాడారు. ప్రతి ఇంటిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి ఆయన ఆశయాలను ముందుకు నడిపించడం ద్వారా బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి జరుగుతుందన్నారు. దళిత నాయకులు వై.గోపి, దళిత ఐక్యవేదిక ఉపాధ్యక్షుడు ఎస్ వెంకట్రావు, ఎ.మోహనరావు, దళిత నాయకులు, గ్రామ సర్పంచ్ ఆర్య సమాజ ప్రతినిధులు, గ్రామస్తులు, బహుజన నాయకులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు అమోఘం

ప్రజాశక్తి - బెలగాం

ప్రజలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సేవలందిస్తూ ప్రజల మన్ననలు అందుకుంది. పదో సారి రక్తదానం చేసిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కొత్తకోట లక్ష్మణరావు గరుగుబిల్లి మండలం కొత్తూరుకు చెందిన ఓనినలిసి శెట్టి (70) రక్తహీనతతో స్థానిక జిల్లా కేంద్రాసుపత్రిలో చేర్పించగా రక్తం దొరకలేదు. రోగి బంధువులు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు బోటు రామకృష్ణకు తెలపగా, రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు కొత్తకోట లక్ష్మణరావుకు తెలపగా, వెంటనే స్పందించి రక్త దానం చేసి ప్రాణాలు కాపాడారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ యమ్మల జనార్దన్ పాల్గొన్నారు. ఎన్నో మంచి సేవా కార్యక్రమాలు చేస్తూ పదో సారి రక్తదానం చేసిన కొత్తకోట లక్ష్మణరావుకు రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు, పేషంట్ బంధువులు అభినందించారు.

ఎన్ని వసతి గృహాలకు అనుమతి ఉందో ప్రకటించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

పార్వతీపురం జిల్లా కేంద్రంతో సహా జిల్లాలో ఎన్ని ప్రయివేటు జూనియర్, డిగ్రీ కళాశాలలకు వసతి గృహాల నిర్వహణకు అనుమతులున్నాయనే విషయం అధికారులు ప్రకటించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు కోరారు. ప్రయివేటు వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల రక్షణ బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. ప్రధానంగా విద్యార్థినిల రక్షణ విషయంలో ప్రభుత్వం, అధికారులు తీసుకుంటున్న చర్యలేమిటని ప్రశ్నించారు. అనేక ప్రయివేటు కళాశాలలు నిబంధనలు పాటించక పోయినా, కనీసం తరగతులు నిర్వహించక పోగా విద్యార్థులు చదువుతున్నట్లు చెప్పుకొని ప్రభుత్వం ఇచ్చే ఫీజులు, స్కాలర్ షిప్పు తీసుకుంటున్నారనే ఉదంతాలపై సమగ్రమైన విచారణ జరిపించాలని కోరారు.

మాదకద్రవ్యాల్లేని సమాజాన్ని నిర్మించాలి

వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి

ప్రజాశక్తి - పార్వతీపురం

మాదకద్రవ్యాల బారినుంచి సమాజాన్ని కాపాడి, మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మించాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు కె.కవిత తెలిపారు. శుక్రవారం స్థానిక ఐటిడిఎ గిరిమిత్ర భవనంలో మత్తు పదార్థాల వినియోగం తగ్గింపు, విముక్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో మాదకద్రవ్యాలు సమాజం, యువత, ఆర్థిక వ్యవస్థలపై చూపే ప్రభావంపై అవగాహన, మాదకద్రవ్యాలు, చెడు ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించడంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఎడి కవిత మాట్లాడుతూ నేడు సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో మాదక ద్రవ్యాలు ఒకటని, యువతను వాటి బారిన పడకుండా కాపాడాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందుకుగాను ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి, డ్రగ్స్ ప్రభావిత జిల్లాల్లో ప్రచారం, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. డగ్స్ వాడకం వల్ల యువత నిర్వీర్యమై దేశ ఆర్థిక ప్రగతి కుంటుపడుతుందన్నారు. కావున డ్రగ్స్‌బారిన పడకుండా విద్యార్థులు, యువతను కాపాడాలని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల వచ్చే అనార్థాలపై సమాజంలో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని, అందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని కోరారు. సీడ్ స్వచ్ఛంధ సంస్థ ప్రధాన శిక్షకులు ప్రకాష్ మాదకద్రవ్యాలు బారిన పడకుండా కాపాడడం, వారికి గల సదుపాయాలు, కుటుంబం సభ్యుల సహకారంపై అవగాహన కల్పించారు. కో అర్డినేటరు రాజు మాట్లాడుతూ విజయనగరంలో మత్తుపదార్థాలకు బానిసైన వారికి, వాటి బారినుండి విముక్తి చేసేందుకు పునరావాస కేంద్రం నిర్వహిస్తున్నామని, నెలరోజులు



సమావేశంలో మాట్లాడుతున్న వికలాంగుల సంక్షేమశాఖ ఎడి కవిత

ఉచిత వసతి, చికిత్స అందిస్తామని తెలిపారు. కావున జిల్లాలో మత్తుపదార్థాలకు బానిసలైన వారిని ఈ కేంద్రాలకు తీసుకువచ్చి సేవలు పొందవచ్చునని, చికిత్స అనంతరం కూడా నిరంతరం వారిని పర్యవేక్షిస్తుంటామని తెలిపారు. శిక్షణలో ఇన్‌ఛార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డి.భాస్కరరావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, ఐసిడిఎస్ పిడి కె.విజయగౌరి ఇతర అధికారులు పాల్గొన్నారు.

మైదాన ప్రాంతంలో యూనివర్సిటీ ఏర్పాటు సరికాదు

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన ప్రాంతానికి తలమానికంగా నిలవాల్సిన కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయాన్ని మైదాన ప్రాంతంలో ఏర్పాటుకు చర్యలు చేపట్టడాన్ని టిడిపి నాయకులు వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ తప్పుబట్టారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గిరిజనుల పక్షం అని చెప్పుకొనే జగన్ గిరిజన వర్సిటీని మైదాన ప్రాంతంలో ఏర్పాటు చేయడమేమిటని ప్రశ్నించారు. టిడిపి హయాంలో వాస్తవానికి కొత్తవలస మండలం రెల్లిలో 500 ఎకరాల స్థలం కేటాయించడంతో పాటు రూ.10 కోట్ల వ్యయంతో చుట్టూ రక్షణగోడ నిర్మించారని గుర్తు చేశారు. అయితే అదే స్థలంలో నిర్మిస్తే టిడిపి ఘనత దక్కుతుందేమోననే అక్కసు, తమ అనుసరులకు ప్రయోజనం చేకూర్చాలనే ఉద్దేశంతోనే స్థలాన్ని మార్పు చేశారని విమర్శించారు. ప్రస్తుతం శంకుస్థాపన చేసిన స్థలానికి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న వైసిపి నాయకుల భూముల ధరలు పెంచడమే దీని వెనుక ఉన్న ఉద్దేశమని ఆరోపించారు. కురుపాంలో నిర్మిస్తున్న గిరిజన ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటులో సైతం ఇన్సైడర్ ట్రేడింగ్ జరిగిందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజన ప్రాంతంలో వర్సిటీని కొత్తగా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

పలు గ్రామాల్లో స్ప్రేయింగ్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అంటిపేట, బొక్కుపేట, బల్లకృష్ణాపురం తదితర గ్రామాల్లో శుక్రవారం దోమల నివారణకు స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ప్రతి గ్రామంలో దోమల నివారించేందుకు స్ప్రేయింగ్ చేయడం జరుగుతుందన్నారు. అలాగే మురుగునీరు నిల్వ ఉండాలే చూడాలని అన్నారు. కార్యక్రమంలో సీతానగరం వైద్యాధికారి కె.శిరీష, ఇఒపిఆర్‌డి కెకె వర్మ, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.



హెల్ప్ డెస్క్‌కు విద్యుత్ కనెక్షన్‌ను తొలగిస్తున్న లైన్‌మేన్

పోలీసులపై విద్యుత్తు లైన్‌మేన్ ప్రతాపం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

తన వాహనానికి కేసు రాశారనే కోపంతో విద్యుత్ శాఖకు చెందిన లైన్‌మాన్ ఏకంగా పోలీస్ హెల్ప్ డెస్క్‌కు విద్యుత్ కనెక్షన్ కట్ చేసిన సంఘటన శుక్రవారం పార్వతీపురం పట్టణంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో పోలీసు ట్రాఫిక్ నియంత్రణ విభాగం హెల్ప్ డెస్క్‌లో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు శుక్రవారం ద్విచక్ర వాహనాలను తనిఖీ చేస్తూ సరైన పత్రాలు లేని వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై పోలీసుల ఆపుతున్నా ఆపకుండా వెళ్లిపోవడంతో వారిని వెనక్కు పిలిచి ఆన్లైన్ కేసు నమోదు చేశారు. దీంతో ఆగ్రహించిన వారు తాము విద్యుత్ శాఖకు చెందిన లైన్మెన్ మీ విధి నిర్వహణలో భాగంగా మీరు మాపై కేసులు నమోదు చేస్తే మా పని మేం చేస్తామంటూ హెల్ప్ డెస్క్ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి సర్వీస్ వైరు కనెక్షన్ తొలగించడంతో పోలీసులు కంగుతిన్నారు. వీరి ప్రవర్తనపై టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడమే కాకుండా సంబంధిత శాఖకు చెందిన అధికారులకు ఫిర్యాదు చేస్తానని ఎస్ఐ పాపారావు తెలిపారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా (దూరవిద్యావిధానం) పది, ఇంటర్ కోర్సుల ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు జిల్లా కో-ఆర్డినేటర్ సిహెచ్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం గిరిమిత్ర భవనంలో అడ్మిషన్లకు సంబంధించిన బ్రోచరును విడుదల చేశారు. పదవ తరగతికి 14ఏళ్లు నిండినవారంతా అర్హులేనని, చదువు మధ్యలో మానివేసిన, టెన్త్ ఫెయిల్ అయి 14ఏళ్లు నిండిన వారు అడ్మిషన్లు పొందవచ్చునని తెలిపారు. ఇంటర్ అడ్మిషనుకు 15ఏళ్ల నుంచి టెన్త్ పూర్తయిన వారంతా అర్హులన్నారు. ఇంటర్ మానివేసిన, ఫెయిల్ అయిన వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు, పలు వృత్తి, వ్యాపార రంగాల్లో ఉన్నవారికి, ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు, వివిధ సంఘ సభ్యులకు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి ఇదొక సదవకాశమని తెలిపారు. సెలవు దినాల్లో మాత్రమే తరగతులు నిర్వహించబడునని తెలిపారు. గత ఏడాది పదో తరగతి 750 మంది, ఇంటర్మీడియట్ 438 మంది చేరినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా కార్యాలయాల సముదాయం (ఆర్‌సిఎం)లో గల జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ప్రతిఒక్కరూ చట్టాలను గౌరవించాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని చిన మేరంగి సిఐ సిహెచ్.ప్రసాద్ అన్నారు. మండలంలోని కొత్తూరులో గురువారం రాత్రి గ్రామస్తులతో సమావేశం నిర్వహించడంతో పాటు శాంతి కమిటీలను ఏర్పాటు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో సిఐ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ఉండాలని కోరారు. అలాగే గ్రామాల్లో చిన్న చిన్న విషయాలకు కొట్లాటలు, గొడవలుపడి పోలీస్ స్టేషన్‌లు, కోర్టుల చుట్టూ తిరగొద్దని హితవుపలికారు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ మాట్లాడుతూ గ్రామంలో అందరూ కలిసికట్టుగా ఉంటూ మరింత అభివృద్ధి చేసుకోవాలని కోరారు. మాజీ ఎంపీపీ ద్వారపురెడ్డి ధనంజయరావు, గ్రామపంచాయతీ సర్పంచ్ ద్వారపురెడ్డి రజిని, స్థానిక ఎస్ఐ ఎం.రాజేష్, పెద్దింటి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

నేత్ర దానంపై జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్య అధికారి జి.నగేష్ రెడ్డి అవగాహన కల్పించారు. ఈనెల 25 నుండి సెప్టెంబర్ 8 వరకు జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలు జరుగుతున్న సందర్భంగా శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో నేత్ర దానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్ర దానం ప్రాముఖ్యత, నేత్రదానం ఎప్పుడు, ఎక్కడ చేయాలి, ఎవరికి సమాచారం ఇవ్వాలి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం నేత్ర సమస్యలున్నవారికి పరీక్షలు నిర్వహించి మందులను, కళ్ళజోళ్లు పడిన వారికి సిఫార్సు చేసి ఉచితంగా అందజేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో నేత్ర వైద్య సహాయకులు మాలిక, శైలజ,రోజా పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - కొమరాడ

అర్హులైన ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సక్రమంగా వాలంటీర్లు అందించాలని ఎంపిడిఒ మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా ఎంపికైన వాలంటీర్లకు జాయినింగ్ ఆర్డర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలో వివిధ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 8వాలంటీర్లు పోస్టులు భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించామని, ఇందులో ఆరుగుర్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. మిగిలిన రెండు ప్రదేశాల్లో ఇంకా ఖాళీలున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సక్రమంగా వాలంటీర్లు బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజలకు సేవలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూగజీవాలకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - సీతానగరం

రైల్వే ప్రమాదంలో మృతి చెందిన మూగజీవాలకు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మం నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధిత గొర్రెల పెంపకందారులు బొమ్మి అప్పలనాయుడు, నాగళ్ల రామును పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ బుధవారం జరిగిన గూడ్స్ రైలు ప్రమాదంలో చనిపోయిన 45 గొర్రెలు విలువ సుమారు రూ.5లక్షలు విలువ ఉంటుందన్నారు. మూగజీవాలను మేత కొరకు ఆరుబయటకు తీసుకు వెళ్లినప్పుడు రైతులు తమ పొలాల వైపు రావద్దని ఆటంకపరుస్తున్నారని, అలాగే కొండ పోరంబోకులు వైపు తీసుకువెళ్తే అటవీశాఖ అధికారులు ఆటంకపరుస్తున్నారని ఇలా అయితే మూగజీవాలను ఎలా పోషించుకోగలరని ప్రశ్నించారు. కావున ప్రభుత్వమే గొర్రెలు, మేకల పెంపకం దారులకు ప్రభుత్వ బంజర భూములను జీవాలు మేపుకునేందుకు హక్కులు కేటాయించాలని, వారి సంక్షేమానికి ఏడాదికి మూడుసార్లు నట్టల నివారణ చర్యలు చేపట్టాలని, ప్రమాదవాశాత్తు చనిపోయిన గొర్రెలు కాపరులకు రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, గొర్రెలకు ఇన్సూరెన్స్ సౌకర్యం, మందులు అందజేయాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు

బకాయి వేతనాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎపి గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన గ్రీన్ అంబాసిడర్ల సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ క్లాస్ మిత్ర కార్మికులకు 6 నెలల నుండి రెండేళ్ల వరకు వేతనాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అతి తక్కువ వేతన జీవులైన పంచాయతీ కార్మిక వేతనాలను ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటే ఎలా జీవించాలి, ఏ విధంగా విధులు నిర్వహించాలో ప్రభుత్వ పెద్దలే తెలపాలన్నారు. పంచాయతీ కార్మికులకు ఎన్నికల ముందు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఈనెల 28న మండల కేంద్రాల్లో దీక్షలు నిర్వహించాలని యూనియన్ పిలుపు నిచ్చింది. ఈ కార్యక్రమంలో కార్మికులంతా పెద్ద ఎత్తున పాల్గొని తమ నిరసన తెలపాలన్నారు.

లప్పటిలో గిరిజనులకు వైద్య సేవలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లుంబేసు పంచాయతీ లప్పటిలో రాఫా ఫౌండేషన్, మధుశ్రీ హెల్త్ కేర్ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. మధుశ్రీ హెల్త్ కేర్ వైద్యులు రవికుమార్ గిరిజనులకు వైద్యసేవలందిం చారు. వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగీ వ్యాధుల పట్ల గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకోవాలని, కాచిన నీటిని తాగాలని సూచించారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాఫ ఫౌండేషన్ ప్రతినిధులు జి.పెంటయ్య, ఎం.శోభన్‌బాబు పాల్గొన్నారు.

వైసిపి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - భామిని

జిల్లా వైసిపి అభివృద్ధికి కృషి చేస్తానని ఆ పార్టీ ఉపాధ్యక్షులు కొవ్వాడ చిరంజీవులు అన్నారు. వైసిపి నూతన కార్యవర్గంలో మండలంలోని కాట్రగాఢ -కె గ్రామానికి చిరంజీవులును జిల్లా కమిటీ ఉపాధ్యక్షులుగా, తోట సింహాచలంను జిల్లా ప్రధాన కార్యదర్శిగా, మాజీ జెడ్పిటిసి సోమరాజు గోపాలరావు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియామకమయ్యారు. ఈ మేరకు వారు సిఎంకు, ఎమ్మెల్యే కళావతికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవులు, తోట సింహాచలం మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యక్రమాలు నిర్వహించి, నిరంతరం పార్టీ అభివృద్ధికి శ్రమిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వీరిని జెసిఎస్ కో ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, టింగ అన్నాజీరావు, మజ్జి మోహన్‌బాబు, కొత్తకోట ఆంజనేయులు, బొడ్డేపల్లి ప్రసాదరావు, మెడిబోయిన చలపతిరావు, గెల్లంకి రమేష్, శాలువా కప్పి సత్కరించారు.

నిస్వార్థ పార్టీని గెలిపిద్దాం

ప్రజాశక్తి - వీరఘట్టం

భ్రష్టు పట్టిన రాజకీయ పార్టీలను తరిమికొట్టి, నిస్వార్థమైన రాజకీయ పార్టీని స్థాపించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గెలిపించి రాష్ట్రానికి మంచి రోజులు వచ్చేలా ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని మాజీ జడ్పిటిసి నిమ్మల నిబ్రామ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద పరిచయ వేదిక కార్యక్రమంలో మాట్లాడారు. తాను గతంలో గ్రామ సర్పంచ్, ఇండిపెండెంట్ జడ్పిటిసిగా రాజకీయ ప్రస్థానం చేశానన్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు తనకు నచ్చి ఈ పార్టీలో చేరానని, గడపగడపకు జనసేన సిద్ధాంతాలు చేరేలా చూస్తానని, పాలకొండ నియోజకవర్గంలో పనిచేసే ఇరు పార్టీలకు ధీటుగా ఉండేలా జనసేనను తీర్చిదిద్దుతానని అన్నారు. ఉత్తరాంధ్ర జనసేన నాయకులు బిపి నాయుడు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ఆశయాలను ప్రజల వద్దకు తీసుకు వెళ్ళేందుకు ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. తొలుత కడకల్లాలో గల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వీధిలో ప్రతి ఇంటింటికి వెళ్లి తన పరిచయం చేసుకొని



ర్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న జనసేన నాయకులు నిబ్రం

అక్కడి నుండి నడిమికెల్ల చేరుకుని ఆంజనేయాలయంలో పూజలు నిర్వహించారు. అక్కడి నుండి విక్రంపురం సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బైక్ ర్యాలీతో వీరఘట్టం చేరుకున్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఎం.పుండరీకం, జానీ, కె.సాయి పవన్, పి.రమేష్, కె.కళ్యాణి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పక్కాగా రోగ నిర్ధారణ పరీక్షలు : డిఐఒ

ప్రజాశక్తి -కొమరాడ

రోగ నిర్ధారణ పరీక్షలు పక్కాగా నిర్వహించి, ప్రజలు సీజనల్ రోగాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని చంద్రంపేటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జ్వర లక్షణాలతో ఎవరైనా ఉన్నారా అని సిబ్బందిని ఆరా తీశారు. ఒపి రికార్డులో వివిధ అనారోగ్య సమస్యలతో శిబిరానికి వచ్చిన వారికి చేపట్టిన ఆరోగ్య తనిఖీలు, పరీక్షలు పరిశీలించారు. జ్వర నిర్ధారణ పరీక్షలకు ఉపయోగిస్తున్న కిట్లు, స్లైడ్‌లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ గ్రామంలో జ్వరాలను గుర్తిస్తే లక్షణాలను అనుసరించి వెంటనే మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యల్లో భాగంగా డ్రై డే కార్యక్రమాలు, స్ప్రేయింగ్ పూర్తి స్థాయిలో నిర్వహించి ప్రజలు రోగాల బారిన పడకుండా అప్రమత్తం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.



గ్రామస్తులకు వైద్యసేవలను వివరిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

అనంతరం గర్భిణీల ఆరోగ్య తనిఖీల కార్డులను పరిశీలించి ప్రతినెలా నమోదు చేస్తున్న హీమోగ్లోబిన్ శాతాన్ని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.సాహితీ, డెమో వై.యోగీశ్వరరెడ్డి, సూపర్ వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది ప్రమీల, అనూష, రామకృష్ణ, 104 సిబ్బంది జగదీష్, దుర్గారావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



చెరువును తలపిస్తున్న ప్రధాన రహదారి

భారీవర్షంతో జలమయం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లా కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారిలో ఉన్న వరద నీరు కాలువలోకి వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో పాత బస్టాండ్ కూడలి నుండి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు నదిని తలపించేలా ఉంది. ఈ రహదారి గుండా రాకపోకలు సాగించేందుకు స్థానికులతో పాటు, పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు నానా అవస్థలు పడుతూ రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలపై అక్రమణలతో ఈ పరిస్థితి దాపురిస్తుందని, కాలువలపై ఆక్రమణలు జరిగినప్పుడు పర్యవేక్షణ చేయకపోవడమే ఈ పరిస్థితికి కారణమని మున్సిపల్ అధికారులను బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా ఉండేందుకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్య అధికారులు ప్రధాన రహదారి కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించి కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలగిస్తే గానీ వరదనీటి సమస్య పరిష్కారం కాదని స్థానికులు అంటున్నారు.

నేరాలు ఘోరాలు

గడ్డి మందు తాగి విద్యార్థిని మృతి

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని కొట్టుగుమ్మడకు చెందిన బూరాడ జోస్నా(23) శుక్రవారం మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు చెప్పిన వివరాలిలా ఉన్నాయి. జోష్నా అనే విద్యార్థి శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో బిఎస్‌సి నర్సింగ్ కోర్సు శిక్షణ పొందుతుంది. విద్యార్థి ప్రథమ సంవత్సరం తప్పింది. అయితే తల్లిదండ్రులు పాస్సైనట్టు అబద్ధం చెప్పింది. దీంతో తల్లిదండ్రులు విజయరావు, రాజేశ్వరి ఈనెల 24న సెలవుపై ఇంటికి వచ్చిన జోస్నాను మందలించారు. దీంతో ఆమె మనస్తాపానికి గురై ఇంటిలో ఉన్న గడ్డి మందును సేవించింది. అపస్మారకస్థితికి ఉన్న ఆమెను తల్లిదండ్రులు స్థానిక పిహెచ్‌సిలో ప్రథమ చికిత్స చేయించి అనంతరం పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ రెలయ్య తెలిపారు.

పొలం తగాదాలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జియమ్మ వలస మండలం వనజలో పొలం నారుమడిలో జరిగిన ఘర్షణలో వ్యక్తి గాయపడ్డాడు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వనజకు చెందిన అడ్డాకుల కేశవరావుకు చెందిన పొలంలో నారుతీతకు వెళ్లిన వ్యవసాయ కూలీలు జన్ని మాధవరావు, ఆరిక తిరుపతిరావు మధ్య చెలరేగిన ఘర్షణలో మాధవరావు తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ మాధవరావు కుటుంబీకులకు ఈ విషయం తెలియ పరచడంతో శుక్రవారం ఉదయం జిల్లా కేంద్ర ఆసుపత్రి లో చేర్పించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.